క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు గ్రామం రెడ్డివారిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆరు మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పాఠశాల నుంచి చెన్నూరు లలిత, వేల్పుల సుధారాణిలు నూజివీడు ట్రిపుల్ ఐటీకు, రాసింటి మేఘన, భూమారపు శివరంజనీ, రూక అశ్విత, టేకూరి విష్ణువర్ధన్‌లు ఆర్‌కే వ్యాలీలో సీట్లు పొందారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకర శివయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పదోన్నతులు కల్పించండి



పదోన్నతులు కల్పించాలని కలెక్టర్‌ను కోరుతున్న వీఆర్‌ఏలు

గాలివీడు : అర్హులైన గ్రామ రెవెన్యూ సహాయకులకు(వీఆర్‌ఏ) ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్‌లుగా పదోన్నతులు కల్పించాలని మండల వీఆర్‌ఏలు జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరిని కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నియోజకవర్గ వీఆర్‌ఏల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌ఏలు మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారికి సర్వీస్ రూల్స్ 1992 ప్రకారం అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని తెలిపారు. ఇదే ప్రాతిపదికన మదనపల్లె డివిజన్‌లో సబ్ కలెక్టర్ పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రక్తదానంపై చైతన్యం రావాలి



గర్భిణికి రక్తదానం చేస్తున్న మహమ్మద్

రాయచోటి టౌన్ : ఆపద సమయంలో రక్తదానం చేయడంలో ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ మైనుద్దీన్ అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని బోస్ నగర్ చెందిన ఒక గర్భిణికి(ఎ+) రక్తం అత్యవసరం కావడంతో మహమ్మద్ అనే యువకుడు రక్తదానం చేశాడని చెప్పారు. ఇలా అత్యవసర సమయంలో ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. రక్తదానం చేయడంలో అందరికీ అవగాహన రావాలని అలాగే చైతన్యం కలగాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ కమిటీ సభ్యులు మహమ్మద్, సుఫియాన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా; తప్పిన ప్రమాదం



బోల్తాపడ్డ లారీని పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్న ఎస్‌ఐ పి.మహేష్

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి ఘాట్ వద్ద భారీ లారీ బోల్తాపడింది. శుక్రవారం సాయంత్రం చెన్నై నుంచి ఇనుప సామగ్రితో పూణె వెళ్తున్న లారీ మంగంపేట ఘాట్ రోడ్డు వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీలో తీసుకెళ్తున్న సామగ్రి చెల్లాచెదురుగా పడిపోయాయి. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తాపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ పి.మహేష్ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని బోల్తాపడ్డ లారీని పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పెనగలూరు : మండలంలో నిత్యం తడి, పొడి చెత్తను సేకరించాలని ఎంపీడీఓ విజయారావు అన్నారు. శుక్రవారం కోమంతరాజుపురం పంచాయతీలో చెత్తను సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది (గ్రీన్ అంబాసిడర్లు)కి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి బేసిన్లలో వేసిన చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించారు. ప్రతిరోజూ గ్రామాలలో తడి, పొడి చెత్తను సేకరించి పరిశుభ్రంగా ఉంచాలని వారు తెలియజేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇందుకు అర్హులన్నారు. బెంగళూరులో 35 రోజులపాటు ఇచ్చే శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. జులై 1 నుంచి బ్యాచ్ ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలను ఉపేక్షించబోం

- పనులు.. చెల్లింపుల్లో భారీ వ్యత్యాసం
- తనిఖీకి ఆదేశించిన పీడీ వెంకటరత్నం



ఉపాధి సిబ్బందిని విచారిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

రాజంపేట టౌన్ : రాజంపేట మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.90 లక్షల మేర పనులకు సంబంధించి వ్యత్యాసాలు ఉన్నట్లు డ్వామా పీడీ వెంకటరత్నం గుర్తించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 25 పంచాయతీలకు సంబంధించి ఉపాధి హామీ పనులు, కూలీలకు డబ్బుల చెల్లింపులు వంటి విషయాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో భాగంగా కూలీలకు అదనంగా డబ్బులు ఇవ్వడం, కొలతల్లో తేడాలు ఉండటం, కొలతలు వేయకపోవడం, పనిచేసిన వాటికి ఫొటోలు పెట్టకపోవడం వంటి లోపాలను గుర్తించారు. ఇందుకుగాను వివిధ పంచాయతీలకు సంబంధించి సిబ్బందికి రూ.42 వేలు జరిమానా విధించారు. అవకతవకలకు సంబంధించి దాదాపు 50 వేలకు పైగా రికవరీకి పీడీ ఆదేశించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఉపాధి హామీ పనులకు సంబంధించిన వ్యత్యాసాలు ఉన్నచోట మళ్లీ తనిఖీ చేపట్టాలని ఏపీడీ, ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలను ఉపేక్షించబోమన్నారు. గతంలో జరిగిన పనులకు సంబంధించి ఏపీడీ, ఎంపీడీఓ మళ్లీ తనిఖీలు నిర్వహిస్తారని, ఆ సమయంలో పనులకు సంబంధించి వ్యత్యాసాలు అలాగే ఉంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులను పరిశీలిస్తే మండలంలో కొంత మంది సిబ్బంది పనితీరు ఏమాత్రం సరిగా లేదని తేటతెల్లమవుతోందన్నారు. పనితీరు మెరుగుపరుచుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని పేర్కొన్నారు. కూలీలందరికి పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పగడాల వరప్రసాద్, ఏపీడీ ప్రతాప్, ఎస్‌టీఎం కోనయ్య, ఎస్‌ఆర్‌పీ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సెలవుపై పంచాయతీ కార్యదర్శులు



ఒంటిమిట్ట: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



సుండుపల్లి: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

లక్కిరెడ్డిపల్లి/ఒంటిమిట్ట/సుండుపల్లి : పనిభారం అధికంగా ఉంటోందని తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమైఖ్య పిలుపు మేరకు ఒక రోజు సామూహిక సెలవుపై వెళ్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం లక్కిరెడ్డిపల్లె ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి, ఒంటిమిట్ట ఎంపీడీఓ సుజాత, సుండుపల్లె ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డిలకు సెలవు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఉద్యోగిపై లేని పనిభారం తాము ఎదుర్కొంటున్నామన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనులు చేయిస్తున్నారని, ఈ పనులు తాము చేయలేమని, సెలవుపై వెళ్తున్నామని చెప్పారు. వివిధ పనులు అప్పజెబుతూ తాము మోయలేని భారాన్ని మోపుతున్నారని, ఈ కారణంగా ఆరోగ్య సమస్యలు, మానసిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదనను తెలియజేశారు. తమ ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవుపై వెళ్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం తమపై వేస్తున్న పనిభారాన్ని తగ్గించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జనరల్ సెక్రటరీ రజనీష్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, నాగమణి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రాజంపేట రూరల్ : తమ హక్కులను సాధించుకునేందుకు రాజంపేట మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నూతన యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ ఒక తాటి పైకి వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు, తమ శ్రేయస్సు కోసం మండలంలో తొలిసారిగా ఈ యూనియన్ నూతనంగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలియజేశారు. యూనియన్ అధ్యక్షులుగా సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, నీలి కమలాదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొత్తపల్లి శ్రీధర్, ట్రెజరర్ పసుపులేటి జయసింహ, మీడియా కన్వీనర్‌గా షేక్ ఇబ్రహీమ్, గౌరవ సలహాదారుగా బుడేన్ సాహెబ్‌గారి కరీముల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా సభ్యులను ఎన్నుకున్నారు.

నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న మావులూరు విశ్వనాథ

రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐసీసీటీయూ జిల్లా నాయకుడు మావులూరు విశ్వనాథ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శానిటేషన్ కార్మికులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 549 ప్రకారం శానిటేషన్ కార్మికులకు రూ.16,000లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11,800లు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇదేంటని కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆరోపించారు. వంద పడకల ఆస్పత్రి అయ్యిండి కేవలం 14 మంది శానిటేషన్ కార్మికులు మాత్రమే పని చేస్తుండటంతో కార్మికులపై పనిభారం అధికంగా ఉంటోందని పేర్కొన్నారు. సిబ్బంది నియామకం పెంచడమే మాత్రమే కాక వారికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాలకు మేలు



నట్టల నివారణ మందు తాపిస్తున్న పశువైద్యాధికారిణి మాధవీలత

నందలూరు : నట్టల నివారణ ద్వారా జీవాలకు ఎంతో మేలు జరుగుతుందని మండల పశు వైద్యాధికారిణి మాధవీలత అన్నారు. శుక్రవారం ఇసుకపల్లి, కుమ్మరపల్లి గ్రామాల్లో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నట్టల నివారణ మందు జీవాలకు తాపించడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ, పశువైద్యులు వీఏ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు శిరీష, జాహ్నవిలు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రుణాలివ్వండి

కలికిరి: మహిళ స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)లకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని వెలుగు జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు సత్యనారాయణ బ్యాంకు మేనేజర్లను కోరారు. శుక్రవారం కలికిరిలో వివిధ బ్యాంక్ మేనేజర్లను కలిసి ఎస్‌హెచ్‌జీలకు రుణాలు గ్రౌండింగ్‌పై చర్చించారు. అంతకు మునుపు స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలతో సమావేశమయ్యారు. ఇకపై ఎస్‌హెచ్‌జీల మహిళలకు వీఓ ద్వారా కాకుండా శ్రీనిధి బ్యాంక్ ద్వారా వ్యక్తిగత రుణాలు ఇవ్వడం ఇవ్వడం, రికవరీలు ఆన్‌లైన్ చేయడానికి ప్రతి మూడు మండలాలకు ఒక శ్రీనిధి బ్యాంక్ మేనేజరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలకు మౌనికను మేనేజరుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో సీసీల అక్రమాలకు తావుండదన్నారు. ఉన్నతి రుణాలకు సంబంధించి రికవరీలో మండలం చాలా వెనుకబడి ఉందని, రికవరీపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండలంలో మహిళ రైతులకు సంబంధించి ఎఫ్‌పీజీలను ఏర్పాటు చేయాలన్నారు.


కూటమి పాలనలో దళితులకు రక్షణ లేదు

కడప రూరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి ఆర్ఎస్ రాజా తెలిపారు. ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జూలై 23వ తేదీన కడప హరిత హోటల్ ఎస్సీ, ఎస్టీల చైతన్య వేదిక సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎస్సీలపై జరుగుతున్న దాడులు, మానభంగాలు, హత్యలను అరికట్టలేకపోవడం పాలకుల చేతకాని తనానికి నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటన జరగడం సిగ్గుచేటన్నారు.

ఏఐటీయూసీ నిరసన ర్యాలీ జయప్రదం చేయండి

పీలేరు : కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వచ్చే నెల 9న నిర్వహించనున్న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరసింహులు కోరారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, రార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా నిరసన కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వచ్చే నెల 9న ఉదయం 10 గంటలకు పీలేరు పట్టణంలో నిరసన ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక నాయకులు యశోద, పి.వి. రమణ, మునిరత్నమ్మ, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

బెయిల్‌పై విడుదలైన ఎంపీపీకి పరామర్శ



ఎంపీపీని, సుగవాసి బాలసుబ్రమణ్యంను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

లక్కిరెడ్డిపల్లి : కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా అరెస్టు అయ్యి, బెయిల్‌పై విడుదల అయిన లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం పరామర్శించారు. శుక్రవారం సాయంత్రం లక్కిరెడ్డిపల్లె కోర్టు ఎంపీపీకి బెయిల్ మంజూరు చేయడంతో గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబసభ్యులు ఘన స్వాగతం పలికారు. విషయం తెలుసుకున్న సుగవాసి ఎంపీపీని కలిసి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరామర్శించడానికి వచ్చిన సుగవాసి బాలసుబ్రమణ్యంను ఎంపీపీ సత్కరించారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా పార్టీ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని వారన్నారు.

వాహనాల తనిఖీ



వీరబల్లి : మండలంలో రాయచోటి–వీరబల్లిమార్గంలో శుక్రవారం స్థానిక ఎస్‌ఐ నరసింహారెడ్డి వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. వాహనాలను ఆపి రికార్డులను పరిశీలించారు. వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు లైసెన్సులు, ఆర్సీలు, ఇన్సూరెన్సులు, ముఖ్యంగా హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను వాహనదారులు పాటించాలని తెలియజేశారు.

హెలెన్ కెల్లర్ స్ఫూర్తి దాత

మదనపల్లె సిటీ: అంధులు, బధిరులు, మూగవారు, వికలాంగుల ఉద్యమాల సారధిగా ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న హెలెన్ కెల్లర్ ఎందరికో స్ఫూర్తి దాత అని వెలుగు ప్రత్యేక పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో హెలెన్‌కెల్లర్ డే నిర్వహించారు. తన జీవిత ప్రయాణానికి అవయవ లోపం అడ్డుకాదంటూ రచయితగా, సామాజిక కార్యకర్తగా, అధ్యాపకురాలిగా ఎదిగారన్నారు. కొంత మంది అవయవాలు లోపం ఉన్నాయని తీవ్ర నిరాశతో జీవితం గడిపేస్తారన్నారు.అదే సమయంలో ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలన్నారు.

వక్ఫ్ బోర్డులో అవినీతిపై విచారణ జరిపించాలి

కడప మైసీఆర్ సర్కిల్: మైనార్టీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డులో జరిగిన రూ.6 కోట్ల అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలని ఆల్ ఇండియా ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అలీ షేర్, ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాకీర్ మౌలానా ఎంఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా కోరారు. శుక్రవారం ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో మైనార్టీ ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మైనార్టీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డులలో రూ. 6 కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని అనేక పత్రికలలో ప్రచురితమైందని తెలిపారు. ఈ స్కామ్‌లో పెద్దల హస్తం ఉన్నట్లు అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ కిషోర్

లక్కిరెడ్డిపల్లి : నాటుసారా కాచి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కోనంపేట పంచాయతీలోని వడ్డెపల్లిలో (సి విభాగం) నాటుసారా విక్రయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు బ్యాక్ సైడ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహిస్తున్నారని, ఎవరేగాని నాటుసారా కాచకూడదన్నారు. ఆ గ్రామ సర్పంచ్, రెవెన్యూ అధికారి, గ్రామ మహిళా పోలీస్, గ్రామ కమిటీ సభ్యులు, అటవీశాఖ బీట్ అధికారి, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, స్వయం సహాయక సంఘాలకు నాటుసారాపై అవగాహన కల్పించారు. ఎవరైనా నాటుసారా కాచి విక్రయిస్తే 12405 లేదా 94409 02594కు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పశు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న పశు వైద్యాధికారి విజయరాజు

సిద్దవటం : పాడి రైతులకు సంబంధించి జీవాలు, బర్రెలు, గేదెల ఆరోగ్య సమస్యల పట్ల వైద్య సేవలను అందించడానికి పశు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మాచుపల్లె పశు వైద్యాధికారి డాక్టర్ విజయరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె పశువుల ఆసుపత్రిలో జ్యోతి, వంతాటిపల్లె, టక్కోలు గ్రామాల పశు వైద్య సిబ్బందితో ఆయన శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న పశువులను పాడి రైతులు వైద్య సేవాల కోసం వస్తుంటారని, వారికి అందుబాటులో ఉండి సరైన వైద్యం అందించాలన్నారు. నట్టల నివారణ మందులను ఉచితంగా జూలై 10వ తేదీ వరకు వేయాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది జిలానీ బాషా, భారతి, మహబూబ్ బాషా, గోపాల మిత్రి సుబ్బనరసింహులు పాడి రైతులు పాల్గొన్నారు.

జయాపజయాలను సమానంగా స్వీకరించాలి



టోర్నీని ప్రారంభిస్తున్న డాక్టర్ అరిగే రాంప్రసాద్

నందలూరు : క్రీడాకారులు జయాపజయాలను సమానంగా స్వీకరించాలని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగే రాంప్రసాద్ పేర్కొన్నారు. అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరవపల్లి క్రికెట లీగ్‌ను ఆయన ప్రారంభించారు. మొదటి మ్యాచ్ ప్రైస్ లెవెన్ జూనియర్ ఫైటర్స్ జట్లు తలబడగా జూనియర్ ఫైటర్స్ విజయం సాధించింది. మ్యాచ్‌లో జూనియర్ ఫైటర్స్ ఆటగాడు చింటు మూడు వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. అలానే మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో సౌమ్యనాథ లెవన్స్‌పై మందపల్లి జట్టు విజయదుందుభి మోగించింది. మందపల్లె జట్టు ఆటగాడు శీను 29 పరుగులు చేయడంతోపాటు మూడు వికెట్లను తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పొందాడు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట సామ్రాజ్, పుత్త శంకర్, అరవపల్లె క్రికెట్ లీగ్ సభ్యులు అరుణ్, బుల్లెట్ హరి, నవీన్, రాము, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఇసుక ట్రాక్టర్ వెళ్లకుండా రహదారికి అడ్డంగా తీసిన గోతిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ రఫీ

సిద్దవటం : ఇసుక రవాణా చేస్తున్నట్లు రైతుల ఫిర్యాదు మేరకు రోడ్డుకు అడ్డంగా గుంతలు తీసినట్లు మండల ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం పరిధిలోని పెన్నానది హైలెవల్ వంతెన సమీపంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో భాగంగా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుకను గృహ నిర్మాణాల అవసరాలకు గ్రామాల్లోకే ఇసుకను తోలుకోవాలన్నారు. పెన్నానది నుంచి ప్రతి రోజు ఎక్కువ సంఖ్యలో ట్రాక్టర్‌ల ద్వారా కడప నగరానికి ఇసుక తరలిస్తూ ట్రాక్టర్‌కు ఇసుక రూ. 4వేలుకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటన్నారన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు బండికనుమ, కమ్మపాలెం, భాకరాపేట రహదార్లలో విస్తృత తనిఖీలు చేపడతామని ఎస్‌ఐ హెచ్చరించారు.

టీబీ వ్యాధి పట్ల అశ్రద్ధ వహించొద్దు



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

రాజంపేట రూరల్ : టీబీ వ్యాధి పట్ల అశ్రద్ధ వహించవద్దని వైద్యులు డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ వికాస్, డాక్టర్ సౌజన్యలు రిమాండ్ ఖైదీలకు సూచించారు. స్థానిక సబ్ జైల్‌లో శుక్రవారం సబ్ జైల్ సూపరింటెండెంట్ అల్లం మలిరెడ్డి ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు టీబీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకిన వారికి 2 వారాలకు మించి దగ్గు ఉంటుందన్నారు. అదే విధంగా రాత్రి సమయంలో జ్వరం రావటం, ఆకలి మందగించటం, బరువు తగ్గటం జరుగుతుందన్నారు. ఛాతిలో నొప్పి, అలసట, చెమటలు పట్టడం, మెడలో వాపులు రావటం వంటివి టీబీ ముఖ్య లక్షణాలన్నారు. వీటిలో ఏ ఒక్క లక్షణం ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గళ్ల పరీక్ష, ఎక్స్‌రే వంటి అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అవగాహనా సదస్సులో టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ ఉల్లంగి జగన్, సబ్ జైల్ సిబ్బంది పోలి రుషికేశవ రెడ్డి, ఎ.ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాల నిఘవ్యవస్థ ఉంచాలని డీఎస్పీ మహేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు కాలేజీల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్‌తో డీఎస్పీ సమావేశమయ్యారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ డే ర్యాలీని విజయవంతం చేసినందుకు ప్రత్యేకంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్ డీఎస్పీని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలని, ఎలాంటి ర్యాగింగ్ జరగకుండా చూడాలన్నారు. పాఠశాల,కళాశాల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

పర్మినెంట్ ఉద్యోగాల పేరుతో వసూళ్లు

- కార్మిక సంఘ నాయకులపై దినసరి పారిశుద్ధ్య కార్మికుల ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన కమిషనర్

మదనపల్లె: సెలక్షన్ గ్రేడ్ మదనపల్లె మున్సిపాలిటిలో పనిచేస్తున్న దినసరి పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయిస్తామని డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణకు కమిషనర్ కే.ప్రమీల ఆదేశాలిచ్చారు. మున్సిపాలిటి పరిధిలో 80 మంది దినసరి పారిశుద్ధ్య కార్మికులు కోవిడ్ సమయం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.15వేల వేతనం చెల్లిస్తుండగా గత జనవరి నుంచి వేతనాలు అందడం లేదు. పర్మినెంట్ లేదా కాంట్రాక్టు లేదా ఆప్కాస్ పరిధిలోని ఈ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగుల తరహాలో ఆప్కాస్ కింద చేర్పించి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కార్మిక సంఘాలకు చెందిన కొందరు నాయకులు నమ్మించారు. కార్మికుల అమాయకత్వాన్ని, ఆశను ఆసరాగా చేసుకున్న సంఘాల నేతలు వారి నుంచి భారీగా డబ్బు వసూలు చేశారు. డబ్బిచ్చాం కాబట్టి నాయకులు తమను శాశ్వతంగా పారిశుద్ధ్య కార్మికులుగా పని చేసుకునే అవకాశం కల్పిస్తారని ఆశలు పెట్టుకున్నారు. అయితే నెలల గడిచినా కార్మికులు ఆప్కాస్ పరిధిలోకి రాలేదు. అయినప్పటికి ఎదురు చూస్తూ వచ్చారు. అయితే గత ఐదు నెలలుగా జీతాలు అందకపోవడం, దీనికి సంబంధించిన వాస్తవాలు సాక్షిలో కథనాలుగా ప్రచురితం కావడంతో కార్మికులకు అసలు విషయం అర్థమైంది. కొన్ని రోజుల క్రితం కార్మికులు సమావేశమై చెల్లించిన డబ్బు విషయంగా చర్చించారు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని తీసుకున్న వారిపై ఒత్తిడి తెచ్చారు. తర్వాత ఏమైందో కాని ఇద్దరు పారిశుద్ధ్య దినసరి కార్మికులు కమిషనర్ ప్రమీలను కలిసి తమను ఆప్కాస్ పరిధిలోకి చేరుస్తామంటూ రూ.40వేలు వసూలు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ విచారణకు ఆదేశించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ఇద్దరు కార్మికులు ఫిర్యాదు చేయగా విచారణ చేయిస్తున్నామని శుక్రవారం చెప్పారు.